క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కనపల


శేఖరరావును సత్కరిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నరసన్నపేట నియోజకవర్గంలోని సీనియర్ నాయకులకు ప్రాధాన్యత లభిస్తోంది. ఇప్పటికే పలువురు పార్టీ పదవులు పొందారు. తాజాగా పోతయ్యవలసకు చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కనపల శేఖరరావుకు పార్టీ రైతు విభాగం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా అధిష్టానం నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి ఆదేశాలు వచ్చాయి. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్యతోపాటు పలువురు నాయకులు శేఖరరావును ఆదివారం సత్కరించారు. పార్టీ ఇచ్చిన ఈ పదవిని సద్వినియోగం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని శేఖరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పొందూరు: మండలంలోని రాపాక కూడలిలో గల విద్యుత్ ఉప కేంద్రంలోని విద్యుత్ సహాయ ఇంజినీరింగ్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక (అదాలత్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల సబ్ డివిజన్ అధికారి ఎస్.శ్రీనివాస్, ఏఈ సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విరిగిన, వంగిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు, లో ఓల్టేజీ సమస్యలు, లాంగ్‌స్పాన్ లైన్లు, అసాధారణంగా అధిక వినియోగం, ఆధార్ వినియోగం, ఆధార్ లింక్, తదితర సేవలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెనూ చార్జీలు పెంచాలి


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా నాయకులు

కొత్తూరు: మధ్యాహ్న భోజనం పథకం మెనూ చార్జీలను పెంచాలని ఎండీఎం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఉత్తర, బి.సుశీల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండీఎం కార్మికుల సమావేశాన్ని మండల యూనియన్ అధ్యక్షురాలు కింజరాపు ఉమ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న ధరల మేరకు ప్రతీ విద్యార్థికి రూ.20 చెల్లించాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.3 వేలు వేతనం కాకుండా కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు ఏడాది మొత్తం వేతనాలు చెల్లించాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పనస రమేష్, భవానీ, కృష్ణవేణి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన..


నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు

పాతపట్నం: సుప్రీం కోర్టు న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై బూటు విసిరిన రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని పాతపట్నం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, శిర్ల ప్రభాకరరావు, నవగాన రత్నాకర్, శిర్ల జోగరావు డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రక్షించాలన్నారు. నిరసనలో యజ్జల భాస్కరరావు, బోయిన శ్రీరాములు, పి. కృష్ణారావు, బరండి గోపాల్, అశోక్, రవి, గోవిందరావు, విశ్వనాథం, షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు


శాస్తుర్లపేటలో సీసీ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

హిరమండలం: మండల కేంద్రంలోని నాలుగు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ వెంకటేష్ ఆదివారం తెలిపారు. మండలంలోని శాస్తుర్లపేటలోని శివాలయం వద్ద రెండు, హిరమండలంలోని కొత్తూరు రోడ్డులో రెండు కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గొట్టా బ్యారేజ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించామన్నారు.

వంశధార నదికి మదనాపురం వద్ద అర్థాంతంగా నిలిచిపోయిన శాశ్వత వరదగట్టు



కరకట్ట లేదు

- 2008లో శాశ్వత వరదగట్టకు శ్రీకారం చుట్టిన వైఎస్సార్
- వరద గట్లు పూర్తికాకపోవడంతో అపార నష్టం
- 17 ఏళ్లు అయినా పూర్తికాని నిర్మాణం


కుంటిభద్ర వద్ద నీట మునిగిన పంట పొలాలు

కొత్తూరు: జిల్లాలోని వంశధార, నాగావళి నదులకు వస్తున్న వరదల వలన ప్రతి ఏడాది వేలాది ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. రోడ్లు కొట్టుకుపోతున్నాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ఇటువంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జిల్లాలోని వంశధార, నాగావళి నదులకు శాశ్వత వరదగట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో రూ.350 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో వంశధార నదికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా బత్తిలి నుంచి కళింగపట్నం వరకు ఇరువైపులా పలు ప్యాకేజీల కింద పనులు ప్రారంభించారు. వైఎస్సార్ మృతి చెందిన తరువాత వరద గట్ల పనులు ముందుకు సాగలేదు. తాము అధికారంలోకి వస్తే వంశధార నదికి శాశ్వత వరద గట్లను నిర్మిస్తామని కూటమి నేతలు 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. గట్ల నిర్మాణం ఊసెత్తడం లేదు. వరద గట్లు నిర్మాణం చేపట్టకపోవడం వలనే పది రోజుల క్రితం వంశధార నదికి వచ్చిన వరదల వలన జిల్లాలోని నదీతీర మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి, తదితర పంట పొలాలు నీటమునిగడంతో అపార నష్టం వాటిల్లింది. పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అర్థాంతంగా నిలిచిపోయిన శాశ్వత వరద గట్లు పనులు పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వరద గట్లను నిర్మించాలి..



వంశధార నదికి శాశ్వత వరదగట్ల నిర్మాణం పూర్తి చేయకపోవడం వలన నదిలోకి కొద్దిపాటి వరద వచ్చినా పంట పొలాలు నీట మునుగుతున్నాయి. పెట్టుబడులు పెట్టి పండించిన పంటలను నష్టపోతున్నాం. ఈ ప్రభుత్వం స్పందించి శాశ్వత వరద గట్లును నిర్మించాలి.

– సాధు నాగేశ్వరరావు, రైతు, అంగూరు, కొత్తూరు మండలం

పంటలను నష్టపోతున్నాం



వరద గట్లు నిర్మాణం ప్రారంభించి సుమారు 17 ఏళ్లు దాటుతోంది. ఇంత వరకు నిర్మాణం పూర్తిచేయకపోవడం సరికాదు. ప్రతి ఏడాది నదికి వస్తున్న వరద వలన చేతికి అందిన పంటలు నీటి మునిగిపోవడంతో కోలుకోలేని నష్టం జరుగుతోంది. సాగుకు చేసిన అప్పులు తీర్చలేక పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాం.

– శిమ్మ మధుసూదనరావు, రైతు, సోమరాజపురం, కొత్తూరు మండలం


మాతల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలి

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో జరిగిన కల్తీ మద్యంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నకిలీ మద్యం వ్యవహారంలో చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువులో డిష్టలరీని ఏర్పాటు చేసి, బెల్ట్ షాపులకు తరలించడం వెనుక టీడీపీ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో తంబళ్లపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డి, అతని బావమరిది గిరిధర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి ప్రధాన నిందితులన్నారు. గతంలో సురేంద్ర రెడ్డికి హత్య కేసులో శిక్ష పడితే అప్పట్లో సీఎం చంద్రబాబు క్షమాభిక్ష పెట్టి విడుదల చేశారన్నారు.

రాష్ట్రంలో నేడు ఊరూరా బెల్ట్ షాపులున్నాయన్నారు. ఆధారాలు లేని లిక్కర్ స్కామ్‌లో తమ పార్టీ నాయకులను అరెస్టు చేసి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైచంద్రారెడ్డి వైస్సార్‌సీపీ కోవర్టు అని టీడీపీ నాయకులు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ పార్టీ నుంచి టీడీపీలోకి వెళ్లిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మంత్రి పార్థసారధి వీరంతా కోవర్టు లేనా అని ప్రశ్నించారు. జయచంద్రా రెడ్డి గడిచిన ఎన్నికల అఫడవిట్‌లో ఆఫ్రికా దేశాల్లో మద్యం డిష్టలరీలు ఉన్నట్లు పేర్కొన్నారని, ఈ విషయం టీడీపీ నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు. కల్తీ మద్యాన్ని కప్పిపుచ్చడానికి ఇటు ప్రభుత్వం, అటు టీడీపీ అనుబంధ పత్రికలు పెద్ద ఎత్తున కష్టపడ్డాయని ఎద్దేవా చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి మెట్టక్కివలసలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు సోమవారం ఉదయం బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు దుంపల శ్యామలరావు, కొప్పుల ఈశ్వరరావు, అన్నెపు సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

దళిత అధికారులపై దాడులు హేయం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

కొత్తూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళిత అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంధవరపు నాగేంద్ర అన్నారు. కొత్తూరులో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 10 తేదీన విధి నిర్వహణలో ఉన్న కొత్తూరు తహసీల్దార్‌తోపాటు ఇతర సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల స్థానిక దళిత మహిళ, ఏపీఎంపై దాడి చేయడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దళిత అధికారులకు భద్రత లేకుండా పోయిందన్నారు. పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మురపాక శంకరరావు, పార్టీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.తమ్మినాయుడు, దళిత నేత మురపాక రామరాజు, సర్పంచ్ వై.ధర్మారావు, చింతాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి దుర్మార్గం..

విధి నిర్వహణలో ఉన్న కొత్తూరు తహసీల్దార్ కె.బాలకృష్ణతోపాటు ఇతర సిబ్బందిపై ఈ నెల 10 తేదీన కార్యాలయంలో జరిగిన దాడిని ఏపీ ఎన్జీఓ కొత్తూరు తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.తిరుపతిరావు, ఇప్పిలి జానకిరామ్య ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడి దుర్మార్గమైన చర్య అని అన్నారు.

అ'పూర్వ' సహకారం


1982-83 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–83 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 42 ఏళ్ల తరువాత ఆదివారం ఒకచోట కలిశారు. పూర్వ విద్యార్థి మూల లక్ష్మణరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత హెచ్ఎం విశ్వేశ్వరరావుతోపాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం స్కూల్ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని హామీ ఇచ్చారు. మూడు, నాలుగు తరగతులకు కోసం నూతనంగా నిర్మించిన గదులకు రూ.1.20 లక్షల విలువ చేసే గ్రిల్స్, ఆఫీసు అవసరం కోసం కంప్యూటర్ వితరణ చేశారు.

నేడు కల్తీ మద్యంపై ర్యాలీ

నరసన్నపేట: కల్తీ మద్యంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో సోమవారం ర్యాలీ, ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఈ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

108లో గిరిజన మహిళ ప్రసవం


108 వాహనంలో తల్లీ బిడ్డ

నరసన్నపేట: స్థానిక జమ్ము కూడలి వద్ద 108 వాహనంలో గిరిజన గ్రామానికి చెందిన గర్భిణికి ఆదివారం సాయంత్రం ప్రసవం జరిగింది. సవర మాలువ గ్రామానికి చెందిన బి.లలితకు పురిటి నొప్పులు రావడంతో పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. లలిత ఆరోగ్యం విషమంగా ఉందని చెప్పి అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. దీంతో 108 వాహనంలో లలిత బంధువులు గర్భిణిని శ్రీకాకుళం తీసుకువస్తుండగా జమ్ము కూడలి వద్దకు వచ్చే సరికి నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది రాంబాబు, హరికృష్ణలు వాహనాన్ని నిలిపి ప్రసవం చేయించారు. లలిత ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండటంతో 108 సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. తల్లీ బిడ్డను నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో జాయిన్ చేశామని వారు తెలిపారు.

ప్రమాదకరంగా పైపులైన్లు


హరిజన వీధి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పైపులైన్


కమ్యూనిటీ హాల్ సమీపంలో విచిపెట్టిన పైప్‌లైన్

సారవకోట: మండలంలోని బద్రి గ్రామంలో 40 రోజుల క్రితం జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ వేసిన కుళాయి పైపులైన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్లు తవ్వి పైపులైన్లు వేసిన కంట్రాక్టర్ కొన్ని వీధుల్లో పైపులను అనుసంధానం చేయకుండా వదిలేశారు. మరికొన్ని వీధుల్లో భారీ పైపులైన్ కోసం గోతులు తీయాల్సి ఉన్నా.. కొంతమేర తీసి పైపులు పూడ్చకుండా బయటే వదిలేశారు. రాత్రి సమయంలో అటుగా వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు తెలిపారు. పశువులు కూడా గోతుల్లో పడిపోతున్నాయన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇదేనా స్వచ్ఛత?


తొగిరిలో రోడ్డుకు మధ్యలో నిలిచిన వర్షం నీరు

- గ్రామాల్లో అపారిశుద్ధ్యం..
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పంచాయతీల్లో నిధుల కొరతతో పనులు చేయని వైనం

నరసన్నపేట నియోజకవర్గంలో పంచాయతీలు, పీహెచ్‌సీల వివరాలు

మండలం	నరసన్నపేట	జలుమూరు	సారవకోట	పోలాకి
పంచాయతీలు	34	40	35	31
పీహెచ్‌సీలు	2	3	2	2

సారవకోట: పంచాయతీల్లో నిధుల కొరత వల్ల అపారిశుద్ధ్య తాండవిస్తోంది. మురుగు నీటి కాలువలు ఎక్కడిక్కడే పూడికలతో నిండిపోవడంతో రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో వ్యాధులను వ్యాపింపజేసే దోమలు, ఈగలు విస్తారంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు గత నెల నుంచి పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరుతూ ధర్నా చేస్తుండటంతో.. సిబ్బందే వైద్య సేవలు అందించాల్సి వస్తోంది. రోగులు ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

దోమల నివారణకు గత ప్రభుత్వం అందించిన ఫాగింగ్ యంత్రాలు ఎక్కడా కన్పించడం లేదు. ఈ యంత్రాల్లో వినియోగించాల్సిన లిక్విడ్ కొనుగోలు చేసేందుకు డబ్బులు కూడా ఇచ్చుకోలేని పరిస్థితుల్లో కొన్ని పంచాయతీలున్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలోని పలు సచివాలయాల్లో ఈ యంత్రాలు మూలకు చేరిపోయాయి. కూటమి నాయకులు చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అసలు పొంతనే ఉండటం లేదు. అధికారులు, పాలకులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీరోజు చెత్త సేకరణ చేయిస్తున్నాం. మురుగు నీటి కాలువల్లో పూడికలు తీయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం.

– పి.సింహాచలం, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ, సారవకోట


చీడిపూడి సచివాలయం సమీపంలో నిల్వ ఉన్న మురుగు నీరు

పొంచి ఉన్న ప్రమాదాలు..!


సురుబుజ్జిలి-మదనాపురం రోడ్డులో మదనాపురం దుర్గ గుడి మలుపు వద్ద ఇలా..

- రహదారులకు ఇరువైపులా పెరిగిన తుప్పలు
- ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు


సరుబుజ్జిలి-మదనాపురం రోడ్డులో తమదాం గ్రామం వద్ద మలుపు ఇలా..

బూర్జ: రహదారులకు ఇరువైలా ముళ్ల తుప్పలు, పొదలు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. బూర్జ మండలంలో పాలకొండ రోడ్డులోని సరుబుజ్జిలి-మదనాపురం మధ్యలో సుమారు 8 కిలో మీటర్ల మేర పూర్తిగా ముళ్లపొదలు అలముకున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించడానికి ఇబ్బంది పడాల్సివస్తోంది. బూర్జ జంక్షన్ నుంచి మామిడివలస వరకు సుమారు 8 కిలో మీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉప్పినివలస నుంచి నామాల లక్ష్మీపురం మీదుగా అన్నంపేట వరకు, అన్నంపేట నుంచి తోటవాడ మీదుగా కొల్లివలస వరకు ముళ్లపొదలు అల్లుకున్నాయి. వీటితోపాటు పలు రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పొదలు తొలగించాలి



రహదారులకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించలేక ఇబ్బంది పడుతున్నాం. ఈ మార్గాల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముళ్ల పొదలు దుస్తులకు తగిలి చిరిగిపోతున్నాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి.

– కొరగంజి శ్రీనివాసరావు, బూర్జ గ్రామం

చర్యలు చేపడతాం

సింగిల్ రోడ్డులో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడెక్కడ ఈ సమస్య ఉందో తెలుసుకుంటాం. తర్వలోనే జంగిల్ క్లియరెన్స్ చేపడతాం.

– ఆంజనేయనాయక్, ఆర్అండ్‌బీ జేఈ


కె.జె పురం రోడ్డులో సామిదలవలస మలుపు వద్ద ముళ్లపొదలు

నేడు నేత్ర వైద్య శిబిరం

సారవకోట: మండలంలోని బొంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ చిన్నాల రామసత్యనారాయణ జ్ఞాపకార్థం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శంకర ఫౌండేషన్ నుంచి వైద్యులు వచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.